క్లుప్తంగా

బక్రీద్ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: బక్రీద్ పండుగ నేపథ్యంలో మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల గురువారం అక్బర్‌బాగ్ డివిజన్‌లో ఉజాలేషాహ ఈద్గా సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రార్థనలకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, ఏఎంహెచ్ఓ రుద్ర శ్రీనివాస్, వాటర్ వర్క్స్ డీజీఎం హస్మత్‌అలీ, ఏరియా మేనేజర్ అల్తాఫ్, జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న ఉన్నారు.

హైదరాబాద్ హరికేన్ జట్టుకు ధరావత్ సురేష్ ఎంపిక



ఎల్‌బీనగర్: నియోజకవర్గం చంపాపేట డివిజన్‌కు చెందిన ధరావత్ సురేష్ వీల్ చైర్ క్రికెట్ (ఆరవ ఐడబ్ల్యూపీఎల్ ఇండియన్ వీల్ చైర్ క్రికెట్ ప్రీమియం లీగ్) హైదరాబాద్ హరికేన్ జట్టుకు ఎంపికై వైస్ కెప్టెన్‌గా నియమితులయ్యారు. ఈ నెల 8 నుంచి 14 వరకు న్యూఢిల్లీలోని సెక్టార్‌బార బాల్‌భవన్ ఇంటర్నేషనల్ స్కూల్ పోటీలను నిర్వహించనున్నట్లు సురేష్ తెలిపారు.

పూడికతీత పనులు పూర్తి చేయాలి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ సర్కిల్–3 పరిధిలోని పలు డివిజన్లలో జరుగుతున్న నాలాల పూడికతీత పనులను వెంటనే పూర్తి చేయాలని సర్కిల్ డీసీ డాక్టర్ తిప్పర్తి యాదయ్య ఆదేశించారు. సర్కిల్ పరిధి మన్సూరాబాద్ డివిజన్‌లో జరుగుతున్న పూడికతీత పనులను గురువారం ఆయన పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే పనులను పూర్తి చేసి కాలనీలకు వరద ముంపు లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీగా చైతన్య కుమార్



సైదాబాద్: సౌత్‌ఈస్ట్ జోన్ నూతన డీసీపీగా ఎస్.చైతన్య కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న పాటిల్ కాంతిలాల్ సుభాష్ కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. హైదరాబాద్ నగర స్పెషల్ బ్రాంచ్ విభాగం డీసీపీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.చైతన్య కుమార్ సౌత్‌ఈస్ట్ జోన్‌కు డీసీపీగా బదిలీపై వచ్చారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

వనస్థలిపురం: డివిజన్ పరిధిలోని కాలనీలలో సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి వి.సైదా నాయక్, ఎల్‌బీనగర్ సర్కిల్ ఉప కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు వెంకన్న, రాజు, ప్రకాష్, రఘుపతిరెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రమాదకర మ్యాన్‌హోళ్లపై రెడ్ పెయింట్

చాదర్‌ఘాట్: ప్రమాదకర మ్యాన్‌హోళ్లను ప్రజలు తేలికగా గుర్తించేందుకు వాటి మూతలపై రెడ్ పెయింట్ వేస్తున్నామని మలక్‌పేట జలమండలి డీజీఎం హస్మత్‌అలీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ మ్యాన్‌హోల్ మూతలపై రెడ్ పెయింట్ ఉంటుందో అది లోతైన మ్యాన్‌హోల్‌గా గుర్తించుకుని జాగ్రత్తగా వెళ్లాలన్నారు. మలక్‌పేట డివిజన్–1 వరద నీళ్లు వెళ్లే మార్గాలు, వరద నీళ్లు నిలిచే ప్రాంతాలు 20 ఉన్నాయని వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద ఉన్న మ్యాన్‌హోళ్లు ఆరు అడుగుల లోతు కంటే తక్కువగా ఉన్నా వాటికి కూడా సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మలక్‌పేటలో ముంపు ప్రాంతాల్లో 829 లోతైన మ్యాన్‌హోళ్లను గుర్తించామని ఇవి ఆరు అడుగుల కన్నా ఎక్కువ లోతులో ఉన్నాయని తెలిపారు. ఎక్కడైనా వరద సమస్య తలెత్తితే 155313కి కాల్ చేయాలని సూచించారు.

భూ భారతితో రైతులకు మేలు

- రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి
- భూ సమస్యలపై దరఖాస్తు చేసుకోండి
- అధికారులు, నాయకులు
- రైతుల నుంచి అర్జీల స్వీకరణ



మహేశ్వరం: తుమ్మలూరులో తహసీల్దార్ సైదులుకు అర్జీలు అందజేస్తున్న రైతులు

మహేశ్వరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో రైతులకు మేలు జరుగుతుందని తహసీల్దార్ సైదులు అన్నారు. గురువారం మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామంలో భూభారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై దరఖాస్తులు చేసుకుంటే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ప్రతీ రైతు రెవెన్యూ సదస్సులో పాల్గొని వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. అంతకు ముందు రైతులు పలు సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సదస్సులో మొత్తం 39 దరఖాస్తులు అందాయని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అమనగంటి ప్రశాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, దానయ్య, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమీర్‌పేట్‌లో..

గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ నవత పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో మొత్తం 23 దరఖాస్తులు వచ్చాయని, అందులో విస్తీర్ణం సవరణ, మిస్సింగ్, విరాసత్, పెండింగ్ మ్యూటేషన్‌లతో పాటు పలు సమస్యలు ఉన్నాయని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధరణితో ఇబ్బంది



కందుకూరు: పులిమామిడిలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కందుకూరు: భూభారతిలో భాగంగా గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి సూచించారు. గురువారం మండల పరిధిలోని పులిమామిడిలో తహసీల్దార్ గోపాల్ ఆధ్వర్యంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ప్రభుత్వం అమలు చేసిన ధరణితో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆరోపించారు. ప్రస్తుతం ఆ సమస్యలను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. భూభారతి చట్టాన్ని అమలు చేయడం హర్షణీయమన్నారు. భూ సమస్యలు లేని గ్రామాలు ఉండాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చి అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్, నాయకులు బి.పాండురంగారెడ్డి, ఎం.రమేశ్, ఎం.మల్లయ్య, పి.రవీందర్, మహేందర్‌రెడ్డి, పి.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ బోధనా పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న రాధాకృష్ణ

సైదాబాద్: ఉపాధ్యాయులు అత్యుత్తమ బోధనా పద్ధతులను పాటించాలని సైదాబాద్ మండల విద్యాశాఖ డిప్యూటీ డీఈఓ రాధాకృష్ణ సూచించారు. గురువారం ఐఎస్‌సదన్ డివిజన్ వినయ్ నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో సైదాబాద్ మండల రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జాతీయ విద్యా విధానంపై ట్రాన్స్‌ఫామింగ్ టీచర్స్ సమ్మిట్–2025 పేరిట ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వర్క్‌షాపు ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశ బోధనలకే పరిమితం కాకుండా, విద్యార్థులకు ఏ రంగంలో ఆసక్తి ఉందో గమనించి వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మసూద్ అహ్మద్, ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ లాస్య సాయి సింధు, మెంటార్ ధర్మేంద్ర కుమార్, అసోషియేషన్ ప్రతినిధులు సత్యం, మహ్మద్ సల్మాన్, అంకితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



గొల్లపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ నారాయణరెడ్డి

శంషాబాద్: భూ సమస్యల శాశ్వత పరిష్కారం భూ భారతి చట్టం ద్వారా జరుగుతుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని గొల్లపల్లిలో రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు, స్థానికులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలను పరిష్కరించి రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టం అములుచేస్తోందన్నారు. భూముల విస్తీర్ణం, పాస్‌బుక్కులు లేకపోవడం, వారసత్వభూములు, భూ స్వభావం, తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు, సాదాబైనామా కేసులు, పార్ట్ బిలో చేర్చిన భూ సమస్యలు ఇలా అన్నింటిని పరిష్కరించేందుకు అర్జీల స్వీకరణ జరుగుతుందన్నారు. నిర్ణీత ఫార్మాట్‌లో రైతులు, భూ యజమానులు అర్జీలను అందజేయాలన్నారు. దరఖాస్తుల స్వీకరణకు హెల్ప్‌డెస్క్‌లు సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్ దత్ పాల్గొన్నారు.

జోరుగా జీవాల విక్రయం

- బక్రీద్ సందడి షురూ
- జోరుగా గొర్రెలు, మేకల కొనుగోళ్లు
- ఆకాశాన్నంటిన ధరలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మేకలు

శాస్త్రిపురం: బక్రీద్‌ను పురస్కరించుకొని ముస్లిం నివసించే బస్తీలు సందడిగా మారాయి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్లలోని పలు ప్రాంతాల్లో గురువారం నుంచే మేకల అమ్మకాలు జోరుగా జరిగాయి. మేకలు, గొర్రెలు ఇతర జీవాలను పెద్ద మొత్తంలో వ్యాపారులు క్రయ విక్రయాలను నిర్వహిస్తున్నారు. నగరంలోని జియాగూడ, చంగిచర్ల, శివారు ప్రాంతాలైనా పెబ్బేరు ప్రాంతాల నుంచి జీవాలను తీసుకొచ్చి అమ్మకాలు జరిపారు. జీవాలతో పాటు, అవి తినే గడ్డి అమ్మకాలు జోరుగా సాగాయి. మూగజీవాల కొనుగోళ్లతో శాస్త్రిపురం, ఎంఎం పహడీ, హసన్‌నగర్, దానమ్మ జోపిడీ ప్రాంతాలు కళకళలాడాయి.

వేలల్లో ధరలు..

మేకల కన్నా ముస్లింలు బక్రీద్ రోజున గొర్రెలను కోయడానికి ఎక్కువ మక్కువ చూపుతారు. దీంతో మేకలకన్నా గొర్రెలే అధిక ధరలు పలికాయి. పది కిలోల గొర్రె రూ. 6500 నుంచి రూ. 9000 వరకు ధర పలికింది. మేకల ధరలు రూ. 6 వేల నుంచి సుమారు రూ.25 వేల వరకు బరువును బట్టి అమ్మినట్లు విక్రయదారులు తెలిపారు.

జోరుగా గడ్డి విక్రయాలు...

రాజేంద్రనగర్ పరిసర ప్రాంతాల్లో సాధారణ రోజుల్లో చూద్దామన్నా పచ్చగడ్డి కనిపించదు. బక్రీద్ పుణ్యమా అని అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రిపురం, చింతల్‌మెట్‌లో ఎక్కడ చూసినా గడ్డి కుప్పలుగా కనిపిస్తోంది. బక్రీద్ రెండు రోజులు ముందు మేకలు, గొర్రెలు కొనేవారు వాటిని తమ ఇళ్లల్లో మేపేందుకు గడ్డిని కొంటున్నారు. గడ్డికుప్ప సైజును బట్టి రూ.100 నుంచి రూ.600 వరకు ధర పలుకుతోంది.

మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రణాళిక

కమిషనర్ సరస్వతి



బడంగ్‌పేట్: కోమటికుంట చెరువు కట్టపై మొక్కలు నాటుతున్న కమిషనర్ స్వాతి, అధికారులు, సిబ్బంది

బడంగ్‌పేట్: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 100 రోజుల ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ సరస్వతి కోరారు. గురువారం ఆ కార్యక్రమంలో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో కోమటి కుంట చెరువుపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యులుగా కమిషనర్ హాజరై మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఇళ్ల ముందు, కాలనీల్లో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. ప్రతి కాలనీల్లో మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్యామ్‌సుందర్, డిప్యూటీ డీఈఈ వెంకన్న, ఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, మెప్మా అధికారి శంకర్, ఈఈ మౌనిక, వార్డు ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది, ఆర్పీలు, స్వయం సహాయక సంఘం మహిళలు పాల్గొన్నారు.

తుక్కుగూడలో..



తుక్కుగూడ: మొక్కలు నాటుతున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల ప్రణాళిక కార్యక్రమం మున్సిపాలిటీ వ్యాప్తంగా కొనసాగుతోంది. నాలుగో రోజు గురువారం పుర కేంద్రంలోని 14వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలు శుభ్రం చేయడం, తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మేనేజర్ సౌమిక్ కుమార్, సీనియర్ అసిస్టెంట్లు మల్లేశ్, స్ఫూర్తి, ప్రశాంత్, పుర సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 64 లక్షలతో రోడ్ల నిర్మాణం

మలక్‌పేట: డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీలలో గురువారం మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గడ్డిఅన్నారం రెడ్‌క్రాస్ హాస్పిటల్ వద్ద, దిల్‌సుఖ్‌నగర్ భవానినగర్‌రోడ్డు, సలీంనగర్ గ్రామీణ బ్యాంక్‌లైన్‌లో, శాలివాహననగర్ భాష్యం స్కూల్ వద్ద మొత్తం రూ.64 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. 15 రోజుల్లో రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, పనుల్లో జాప్యం జరిగితే కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. ఏఈ శరత్‌రెడ్డి, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, నాయకులు దినేష్, సురేందర్, ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.

యువ వైద్యుడి అదృశ్యం

సైదాబాద్: యువ వైద్యుడు అదృశ్యమైన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పూసలబస్తీలో నివసించే వైద్యుడు సాయిరాం (32).. సర్టిఫికెట్స్ రెన్యువల్ చేసుకోవడానికి కోఠిలోని ఐఎంఏ కార్యాలయానికి వెళ్లి తిరిగి రాలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

ఫ్లై ఓవర్‌ల నిర్మాణాలకు మంత్రికి వినతి



కాలనీవాసులతో కలిసి వినతిపత్రం ఇస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్‌బీనగర్: విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చింతలకుంట నుంచి ఆటోనగర్, భాగ్యలత నుంచి హయత్‌నగర్ రేడియో స్టేషన్ వరకు నిర్మించే అండర్‌పాస్‌లకు బదులు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని వివిధ కాలనీ వాసులతో కలిసి రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కలిసి వినతి పత్రం అందజేశారు. చింతలకుంట నుంచి హయత్‌నగర్ వరకు ప్రస్తుతం రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయని, వెహికిల్ అండర్‌పాస్‌నా, ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలా? అనే విషయాన్ని జాతీయ రహదారుల ఇంజినీరింగ్ అధికారులు తేల్చుకోలేకపోవడంతో గత ఆరు నెలల నుంచి ఇక్కడ పనులు జరగడం లేదని దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మొక్కలతోనే మానవ మనుగడ

జాతీయ పర్యావరణ దినోత్సవంలో అధికారులు, నాయకులు



మీర్‌పేట: చందన చెరువు కట్టపై మొక్కలు నాటుతున్న మహిళలు

మహేశ్వరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, వాటితోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంగి రమేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని కోరారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.చందన, ఎన్ఎస్ఎస్ అధికారి డా.జహేదా బేగం, ఎకో క్లబ్ కో–ఆర్డినేటర్ డా.శ్రీహరిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేయరాదు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ చందన చెరువు వద్ద గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చెరువు కట్టపై పర్యావరణ అనుకూలమైన స్టాల్స్ ఏర్పాటు చేసి తడి, పొడి చెత్తను రోడ్లపై వేయకుండా చెత్త సేకరణ ఆటోల్లో వేయాలని కమిషనర్ జ్ఞానేశ్వర్ అవగాహన కల్పించారు. దీంతో పాటు ఇంట్లోనే కంపోస్ట్ తయారీ గురించి వివరించారు. అనంతరం ఉమెన్ ఫర్ ట్రీస్ ప్లాంటేషన్‌లో భాగంగా స్వయం సహాయక సంఘం మహిళలతో మొక్కలు నాటించారు. కార్యక్రమంలో మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, పర్యావరణ ఇంజినీర్ రాము, టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ లక్ష్మయ్య, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కందుకూరు: ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీడీఓ సరిత, ఫ్యూచర్‌సిటీ సీఐ కృష్ణంరాజు కోరారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో అధికారులు, సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కందుకూరు, కొత్తగూడలో ఎంపీడీఓ, ఆకులమైలారంలో సీఐ గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ రవీందర్‌రెడ్డి, టీఏ తిరుపతిరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేందర్, మాజీ ఉపసర్పంచ్ జి.రాజు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం: కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న అధ్యాపకులు



కందుకూరు: కందుకూరులో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ సరిత తదితరులు



కందుకూరు: ఆకులమైలారంలో మొక్కలు నాటుతున్న సీఐ కృష్ణంరాజు తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వాంబే కాలనీ, రాజీవ్ గృహ కల్పలలో జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. పైపులైన్ వ్యవస్థ దెబ్బతినడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అదే విధంగా అపార్ట్‌మెంట్‌లో డ్రైనేజీ లైన్ కుంగిపోయి ఉన్నా పరిస్థితి, ఫ్లోరింగ్ పనులకు అధికారులతో చర్చించారు. తాగునీటిలో వ్యర్థాలు కలవకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథ్, హనుమంత్‌రెడ్డి, పాండుయాదవ్, మధుసూధన్‌రెడ్డి, అరుణ్, మాలతీ, లక్ష్మి, జయంతి, ఆండాలు, నరసమ్మ, రవీందర్, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి సూపర్‌వైజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

నార్సింగి మున్సిపాలిటీకి అవార్డు



మంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీకి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నుంచి రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ నిషేధం అమలు, ఘన వ్యర్థాల నిర్వహణ, పచ్చదనాన్ని ప్రోత్సహించడం వంటి వాటిలో కృషి చేసినందుకు ఈ అవార్డు దక్కింది. గురువారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల పక్కన సంవత్సరం నుంచి మూడేళ్ల వయసు ఉన్న మొక్కలను నాటి పరిరక్షించామన్నారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్ కవర్‌ల నిషేధాన్ని పటిష్టంగా అమలు చేస్తున్నామన్నారు. తడి, పొడి చెత్తలను వేరుగా సేకరించి ఘన వ్యర్థాలుగా, వర్మికాంపోస్ట్ ఎరువులుగా తయారు చేస్తున్నామన్నారు. మున్సిపాలిటీ ప్రజలు, వ్యాపారులు సహరించటంతోనే ఇది సాధ్యమయ్యిందన్నారు.